# హేమంత తుషారం -10

''నాగసుందరి కొత్త చీరలో పెళ్ళికూతురిలా ఉంది గానీ, హేమంత్ మాత్రం మామూలుగా సాదాసీదాగానే ఉన్నాడే అనుకుంటూ, అతని పక్కనే నిలబడి తమనే చూస్తున్న వ్యక్తిని గమనించి తృళ్ళిపడిరది....!

రాఘవరావు...! తన మనసులో కూడా ఎపుడూ ఆపేరు తలుచుకునేది కాదు.

ఆయనగారు....! ఎందుకనో గానీ తనకి అలాగే అలవాటయింది!

నాగసుందరి మహాలక్ష్మి వైపు చిరునవ్వుతో చూసి ''ఏమిటక్కా అలా నిలబడి పోయావ్...? రాఘవా, నేనూ అమ్మానాన్నలం అయ్యాక, ఇన్నేళ్ళకి పెళ్ళి చేసుకున్నాం!'' అంది గుసగుసగా చెవిలో చెప్పినట్లుగా.

అప్పటికి ఆశ్చర్యం నుండి కొంచెం తేరుకుంది మహాలక్ష్మి.

అయితే పెళ్ళికొడుకు హేమంత్ కాదా...?! ఇదెలా జరిగింది...? నాయనమ్మకి అన్నీ ముందే తెలుసన్నమాట!

ఆలోచనలనుండి, ఆశ్చర్యం నుండి నాగసుందరి మాటలతో బయటపడిరది మహాలక్ష్మి.

హేమంత్ మహాలక్ష్మి వేపు చిరునవ్వుతో చూసి మౌనంగానే ఉండిపోయాడు. రాఘవరావు మాత్రం కొంచెం బెదురుగా మహాలక్ష్మి దగ్గరకు వచ్చి ''నన్ను క్షమించు మహాలక్ష్మి...'' అంటూ చకచకా అడుగులు వేస్తూ బయటకు వెళ్ళిపోయాడు. అతనితో పాటూ హేమంత్ కూడా వెళ్ళాడు.

మీనాక్షమ్మ వసుంధరతో చనువుగా లోపలికి వెళ్ళింది. ''భోజనాల ఏర్పాటు చూద్దాం... పదండి...'' అని వాళ్ళు అనుకోవటం విని మహాలక్ష్మి 'నాన్నమ్మా... నీ కన్నీ తెలిసి కూడా ఏమీ తెలియనట్లుగా, మామూలుగా ఎలా ఉండగలిగావ్...!' మనసులోనే నిర్ఘాంతపోయింది.

హాలుగదిలోని సోఫాలో మహాలక్ష్మిని కూర్చోబెట్టి, పక్కనే నాగసుందరీ కూర్చుంది.

''అక్కా.... నువ్వింకా అయోమయంలోనే ఉన్నట్లున్నావ్! ఇపుడు నే చెప్పేది సావధానంగా విను...'' అంది నవ్వు మొహంతో.

''అక్కా.... నువ్వు నన్ను ఒకసారి మాత్రమే చూశాననీ, నేనసలు, నిన్ను చూడనే లేదనీ అనుకుంటున్నావుగానీ, నిన్ను నేను రెండు మూడుసార్లు దూరం నుండి చూశాను. అందువల్ల నీకీ విషయం తెలియదనుకో...!

నిన్ను ఇక్కడ చూసినపుడు గుర్తు పట్టానుగానీ, నేనది బయటపెట్టలేదు. ఆరోజు పెళ్ళి పిలుపంటూ మీ ఇంటికి వచ్చినపుడు... నేను బామ్మ ఇచ్చిన కాఫీ తాగుతూ చాలా చాలా విషయాలు చెప్పాను. ఓపిగ్గా విన్నారు. నీకు నేను చెప్పేవరకూ ఏ విషయం నీ దగ్గర ప్రస్తావించవద్దని అర్థించాను. ఎందుకంటే... నా సంజాయిషీ ఏమిటో స్వయంగా నేనే చెప్పాలనుకున్నాను... మరి... మరి... జరిగిన దానిలో అన్యాయమంటూ జరిగింది నీకే కదా...! ఆ కాలంలోని చేదు జ్ఞాపకాల్ని చెరిపేసుకుని... కొత్త జీవితానికి పునాది వేసుకోగలిగావు! ఇంకొకరు ఎవరైనా అయితే జీవితాంతం కుమిలిపోతూనే ఉండే వాళ్ళేమో...!

నీ పట్ల నిర్లక్ష్యం చూపటంలో రాఘవ కంటే అత్తదే ప్రధాన పాత్ర. తన అత్తగారి పెత్తనంలో బాధలు అనుభవించటంతోనో ఏమో... ఆమె మనసు కరుడుకట్టిపోయింది. తను అనుభవించిన శిక్షలన్నీ కోడలూ

అనుభవించాల్సిందే అనుకుని వుంటుంది! మీ ఇంటి విషయాలన్నీ అప్పట్లో నాకూ తెలుస్తుండేవి కనుకనే ఇలా చెబుతున్నాను.

రాఘవతో నా ప్రేమను పెద్దవాళ్ళు అంగీకరించటం లేదని తెలిసి నేనే ముందడుగు వేసాను. మా మధ్య బంధం ఏర్పడిరదని పెళ్ళవాళ్ళేపంతం వీడి మా పెళ్ళి చేస్తారని ఊహించాను. అయితే తొందరపడి అత్త రాఘవ పెళ్ళి నీతో జరిపించేసింది.

మీ పెళ్ళి అయినా, నేను మాత్రం రాఘవకు దూరం కాలేదు. నిజం చెప్పాలంటే రాఘవ ప్రేమలోనే నిజాయితీ ఉంది. వివాహ బంధాన్ని ఆసరా చేసుకుని నీకూ దగ్గరవ్వాలని ప్రయత్నించలేదు... అవునా...? అప్పట్లో నీకు చదువు పట్ల వ్యామోహమే గాని వివాహ బంధం పట్ల అనురక్తి కూడా లేకపోవటమూ మీ మధ్య అనుబంధం ఏర్పడకపోవటానికి ఒక కారణం అయివుంటుందేమో... అది నాకు సరిగ్గా తెలియదనుకో...!

ఎవరో దాయాదుల ఆస్తికోసం పిల్లల్ని కనాలని తల్లి ప్రోత్సహించి మభ్యపెట్టినా, నీ నిర్లక్ష్యంతో మిన్నకుండి పోయాడుగానీ, భర్తగా దౌర్జన్యం చేయలేదన్నది నిజమే కదూ...? అందుకే... వివేకంతో ఆలోచిస్తే జరిగిన దానిలో నా తప్పే ఎక్కువగా కనుపిస్తోంది!

నువ్వాయింటి నుండి వెళ్ళిపోయాక, నాతో పెళ్ళి మాటలు ప్రారంభించారు. కోర్టులో దావా గెలిచి మా ఆస్తి మళ్ళి మాకు చేజిక్కిందని ఆ నిర్ణయానికి వచ్చారని, ఆతనితో పెళ్లికి నేను అంగీకరించలేదు. అప్పట్లో నాకు అహం చాలా ఎక్కువగానే ఉండేది. అందరూ నా అందచందాల్ని పొగడటం వలనో ఏమో మరి! అదెంత మూర్ఖత్వమో ఇపుడు నాకు అర్థమౌతోంది.

నీకు బాపూబొమ్మ అనే పేరుందనీ, నీ ఫ్రెండ్స్ంతా అలా పిలుస్తారని విని నిన్ను చూడటానికి మీ ఇంటికోసారి వచ్చినా అత్తవలన నా ప్రయత్నం ఫలించలేదు. ఆ తర్వాత దూరం నుండి రెండు మూడు సార్లు నిన్ను చూడగలిగాను. ఆ విషయం నీకు తెలియకపోవటం వలనే నిన్ను నేను గుర్తు పట్టలేదని... ఇక్కడ మొదటిసారి కలుసుకున్నపుడు అనుకున్నావని నేనూహించాను. హేమంత్ బావకి కూడా ఈ విషయలన్నీ తెలుసు. అనవసర ప్రసంగమనే ఉద్దేశ్యంతోనే తనూ నీ దగ్గర ఆ సంగతులేవీ ప్రస్తావించలేదనుకుంటా. కాకపోతే, ఆ విషయాలన్నీ నువ్వు చెప్పినపుడు ఆశ్చర్యంగా విన్నాడట!

మా అమ్మ వాళ్ళతో అబార్షన్‌కి అంగీకరించనని చెప్పి ఇక్కడకు వచ్చినపుడు వసుంధర అత్తమ్మే నాకు ఆశ్రయం ఇచ్చి ఆదుకుంది. హేమంత్ బావ ప్రోత్సాహంతోనే కొత్త జీవితాన్ని ప్రారంభించాను.

రాఘవకూడా ఇంకొకరితో పెళ్ళికి అంగీకరించక ఒంటరిగానే మిగిలిపోయాడు. తన తల్లీ దూరమయ్యాక, వ్యసనాలకి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. ఇప్పటికీ నాతో కలిసి ఉండాలనే కోరిక ఉందని చెప్పినపుడు... ముందు ఆ వ్యసనాలకు దూరం కావాలని షరతు పెట్టాను. అది పాటించటంతో అతని నిజాయితీ పట్ల నాకు నమ్మకం కలిగింది.

ఈ సమయంలోనే అత్తమ్మ నాకో తోడు తప్పనిసరని నచ్చచెప్పి సంబంధాలు కూడా చూడటం మొదలు పెట్టిందని నాకూ తెలిసింది. అపుడే ఎవరో అన్న మాటల్ని బట్టి అత్తమ్మే నన్ను కోడలిగా చేసుకుందామనే ఆలోచన వచ్చి నీతో సంప్రదించిందట కదా! ఆ విషయం నువ్వు ఇంటికి వచ్చినరోజే మాకూ చెబితే మేం ఇద్దరం మా అభిప్రాయాలూ తెలియజేశాం.

అక్కా... నేనప్పటికే రాఘవతోనే నా జీవితాన్ని కొనసాగించాలని నిర్ణయించు కున్నాను. ఇపుడు నీకంతా వివరం తెలిసిందిగా...!

ఇపుడు రాఘవ దురలవాట్లన్నిటికీ దూరం అయ్యాడు... అంతేకాదు... జీవితాంతం నాకు తోడుగా, పాపకు తండ్రిగా నిలబడతానని పదేపదే ప్రాధేయపడ్డాడు.

అందుకని... ఎప్పటికీ ఒంటరిగా ఉండాలన్న నిర్ణయాన్ని అత్తమ్మ మాటలతో మార్చుకున్న నేను రాఘవ పట్ల నమ్మకమూ కలిగి అతని ప్రతిపాదనను అంగీకరించాను. ముందుగా నీ అనుమతి, క్షమాపణ పొందాలనుకున్నా హేమంత్ బావ ద్వారా నీకు నామీద ఎటువంటి వ్యతిరేకత, ఆగ్రహం లేదని తెలిసి... ఈ పెళ్ళికి ఇష్టంగానే అంగీకరించాను.

ఇపుడు చెప్పక్కా... నేను చేసింది సరియైనదేగా... తప్పు లేదుగా...?'' అంటూ మహాలక్ష్మి చేయిపట్టుకుంది.

''నీది మంచి నిర్ణయమే సుందరీ...!'' మెల్లగా అభినందిస్తున్నట్లుగా చెప్పింది మహాలక్ష్మి.

సుందరి పెదవులపైకి చిరునవ్వు వచ్చింది. బరువు తీరినట్లు తేలిగ్గా నిట్టూర్చింది. ''ఇన్నాళ్ళకి... పిల్లను కూడా కన్నాక... ఇపుడు పెళ్ళి పీటలపై కూర్చోవటం నాకు ఇష్టం లేకపోయింది. రిజిష్టర్ మ్యారేజికి రాఘవా అంగీకరించటంతో అలా జరిగిపోయింది.

మా ఊళ్లో మా వాళ్ళు కూడా మా నిర్ణయానికి ఆనందించారు. ఈ రోజు అక్కడ మా ఇంట్లో కొద్దిమంది బంధువులకు విందు భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

మా ఇద్దరితో పాటు మా ఊరికి హేమంత్ బావ కూడా వస్తున్నాడు. సాయంకాలానికి తిరిగి వచ్చేస్తాడు...'' అంటూ నాగసుందరి లేచినిలబడి ''అదుగో... వాళ్ళు టాక్సీ కూడా తీసుకువచ్చేసారు ఇక వెళ్ళిరానా...?'' అనడిగింది.

మౌనంగా చూస్తూ నిలబడి ఉండిపోయింది.

వసుంధర వచ్చి ''మా ఇంట్లో మీ కోసమే నేను భోజనాల ఏర్పాటు చేశాను... మనమూ కానిచ్చేద్దాం... రండి...'' అనటంతో అక్కడున్న వాళ్ళు డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు.

మీనాక్షమ్మ భోజనం చేస్తూ ఎంతో పరిచయం ఉన్నట్లుగా వసుంధరతో మాట్లాడటం మహాలక్ష్మికి కొంచెం ఆశ్చర్యంగానే ఉంది.

''ఈ దోసకాయ పప్పు చాలా రుచిగా ఉంది. ఈ అప్పడాలు కొన్నవేనా.. తయారు చేయించారా... కొబ్బరి కాయ మరీ ముదురుగా గానీ, లేతగానీ కాకుండా ఉంటే, కొబ్బరి పచ్చడి ఇలా రుచిగా కుదురుతుంది. పులుసు కూడా ఇంగువ తాలింపుతో ఎంత కమ్మగా ఉందో...!''

బోజనం చేస్తూనే చనువుగా అలా వంటకాల గురించి ఏమిటేమిటో చెబుతున్న నాయనమ్మ వైపు ఆశ్చర్యంతోనూ, చిరునవ్వుతోనూ చూస్తుండిపోయింది మహాలక్ష్మి.

''ఏదో నాకు చాతనైనట్లుగా చేశా... మీరు బావున్నాయని అంటున్నారు... ఏదో బాగా చేయాలని ప్రయత్నిస్తుంటాను గానీ... సాధారణంగా అంత బాగా రావు. మా అబ్బాయి వంకలు పెడుతూనే ఇష్టంగా తినేస్తుంటాడు. సాధారణంగా నేనే చేస్తాను... ఇద్దరమేగా ఎపుడైనా ఎవరైనా వస్తుంటే మాత్రం... ఇదిగో... ఈ సుగుణమ్మని సాయనికి పిలుస్తాను...'' మీనాక్షమ్మ మాటలకు బదులుగా వసుంధరా మాటలు కలిపింది.

''బాగా చేశారమ్మా....'' అంటూ వడ్డిస్తున్న సుగుణమ్మ వేపు ప్రశంసగా చూసిన మీనాక్షమ్మ వసుంధరతో మళ్ళీ అంది. ''వంట బాగా తెలిసుంటేనే, మనమూ ఎవరితోనైనా బాగా చేయించగలం కూడా! అంతేకదా....!'' అని నిట్టూర్చి

''మా మహాలక్ష్మికి మాత్రం ఈ రుచుల సంగతి అస్సలు పట్టదు. 'ఏదో ఒకటి లెద్దూ..' అనేస్తుంది! ఉద్యోగాలు చేస్తుంటే మాత్రం... తినే తిండి పట్లా కాంచెం శ్రద్ధ ఉండాలని చెబుతూంటానుగానీ చెవిని పెట్టదు!'' అంది.

''మా అబ్బాయికి మాత్రం... వంట సంగతి ఫరవాలేదుగానీ వడ్డించేవాళ్ళు మాటల్లో మాత్రం రుచులు తప్పనిసరిగా ఉండాలంటాడు...''

ఆవిడ మాటల పూర్తికాకుండానే మీనాక్షమ్మ ''మాటల్లో... రుచులేమిటీ...?'' అనడిగింది. వసుంధర చిన్నగా నవ్వింది. ''అలా ఏవో అల్లరి మాటలు వాడికి అలవాటు లెండి. వడ్డిస్తూ ప్రేమగా మాట్లాడితే, ఏదైనాసరే, ఆ వంటకం తీయగా పాయసంలా ఉంటుందట! గట్టిగా మాట్లాడితే... ఘాటుగా కారం వంటకంలా అనిపిస్తుందట...!''

''బావుంది మాటల చమత్కారం ఉంటే చాలన్న మాట...!'' అంటూ మీనాక్షమ్మ చిరునవ్వు చిందించింది.

తీపి, కారం చెప్పారు... మరి మిగతా రుచుల కోసం ఎలా మాట్లాడాలో అదీ చెప్పారా...? అని అడుగుదామనుకుంది గానీ బావుండదనుకుంటూ తల వంచుకుని భోజనం ముగించింది మహాలక్ష్మి.

వసుంధర మహాలక్ష్మి దగ్గరకు వచ్చి ఓ కవరు అందించింది.

''రాత్రి కూర్చుని ఏదో రాసుకుంటుంటే ఏమిటని అడిగితే, నీకే ఉత్తరమని చెప్పాడు. రేపు మనింటికే వస్తున్నారు కదా అంటే...ఉత్తరంలో అయితేనే చెప్పాలనుకున్నది వివరంగా చెప్పగలననీ అన్నాడు. ఇక పోస్టు చేయటమెందుకని నేనే నీకు అందజేస్తానని చెప్పాను. ఇంటికి వెళ్ళాక తీరికగా చదువు... మహాలక్ష్మి...!'' చిరునవ్వుతో ప్రేమగా అంది.

మహాలక్ష్మి తలవూపుతూ వెంటనే ఆ కవరును తన హాండ్ బ్యాగ్‌లో పెట్టేసుకుంది. కాసేపు

ఉండమని ఆవిడ అడిగినా 'మరోసారి కలుస్తాంగా' అంటూ బయలుదేరారు.

కారు బయలుదేరిన కాసేపటికి మీనాక్షమ్మని ''ఏమిటంత సరదాగా, చనువుగా కబుర్లు చెప్పేసావ్ ఆవిడతో...?'' అనడిగింది మహాలక్ష్మి.

''బావుంది బంధుత్వం కలుపుకోబోతున్న వాళ్ళతో ఆ మాత్రం కలివిడిగా ఉండమా...?'' మీనాక్షమ్మ మనవరాలిని ఎదురు ప్రశ్నించింది.

''ఏమన్నావ్...? బంధుత్వమా...?'' ఆశ్చర్యంగా చూసింది మహాలక్ష్మి.

''ఏమిటో... నీ కింకా అర్థంకాలేదని నన్ను నమ్మమంటావా...? నాకన్ని విషయాలూ వాళ్ళు వివరంగా ముందే చెప్పారుగా. నాగసుందరి మరి నీతో మాట్లాడిరదేమిటీ...! హేమంత్ కూడా ఏదో వివరంగా ఆ ఉత్తరంలో రాసే ఉంటాడులే. అందుకే గదూ, నువ్వు ఇంటికి వెళ్దామని అంత తొందరపడ్డావ్... నన్నూ బయలుదేరదీశావ్‌గా...!''

మహాలక్ష్మి ఆవిడ వేపు చురచుర చూసి ''చాల్లే... ఇంటికి వెళ్ళాక మాట్లాడుకుందాం....'' అని ముగించేసింది.

* * *

ఇంటికి వెళ్ళగానే... ''రా... మీ అమ్మనాన్నలకి అక్కడి విశేషాలు చెబుదాం...'' అన్న నాన్నమ్మ మాటల్ని వినిపించుకోనట్లుగా తన గదిలోకి వెళ్ళిపోయింది మహాలక్ష్మి.

మీనాక్షమ్మ మొహంలోకి ముసి ముసి నవ్వులు వచ్చాయని గమనించినా లెక్క చేయలేదు.

'ఏం రాశాడో హేమంత్' అనుకుంటూ తొందర పడిరది.

గది తలుపులు జేరవేసి తీరిగ్గా కూర్చుని... అంటించిన కవరును చించి కాగితాల్ని బయటకు తీసి చదవటం మొదలు పెట్టింది.

తుషారా....

మిమ్మల్ని ఇలా మనసారా, ఇష్టంగా పిలువగలిగే అదృష్టం ఇంత తొందరలోనే నన్ను వరించగలదని ఊహించలేదు. మీరు ఉలిక్కిపడకండి... మీరే తుషార అని నాకెలా తెలిసిందా అని! ఎపుడు, ఎలా అన్నది అనవసరమేగానీ, ఈ విషయం నాకు తెలిసిందని మీరూ ఊహించగలిగారనే నేనూ అనుకుంటున్నా. నిజమే కదా...!

తుషార...! ఈ పేరు నా మనసులో మెదిలితేనే చాలు.... హేమంతంలో ఉషోదయాన... పచ్చని ఆకులపై మెరిసే తుషార బిందువుల అందాన్ని ఆస్వాదిస్తున్న అనుభూతితో మనసు పులకించిపోతోంది! అందమైన రూపలావణ్యాలకి, విశిష్టమైన వ్యక్తిత్వమూ జత కలవటమన్నది కొందరు అపురూపమైన వ్యక్తులలోనే కనిపిస్తుంది! అలాంటి అరుదైన ఆణిముత్యం... తుషార... నా కలల మనోహరి... నా జీవిత సహచరి కాబోతోందంటే.. ఈ అదృష్టాన్ని ఏమనుకోను.... కనుపించని దేవతలెవరో కరుణించి ఇచ్చిన వరమా... ఇది...? అంతే అయ్యుంటుంది!

మీకోసారి చెప్పానుగా... ఊహాలోకాల విహార యాత్ర నా కలవాటని! ఇక ఇపుడు జంటగా విహరించే తరుణం వచ్చేసింది! అవునండీ... ఏకాంత శిశిరానికి సెలవు చెప్పేసి నిత్యవసంతానికి స్వాగతం చెబుదాం... జంటగా!

ఇక మీ అపోహలకి... నా వివరణ వినండి.

నాకు నచ్చిన వ్యక్తిలో నేనున్నానా లేదా అన్నదే నాకు ముఖ్యం! అంతవరకే నాకవసరంగానీ, వారి మునుపటి పరిస్థితులేమిటన్నది అనవసరమే కదా! కులం, గోత్రంతో పనిలేదు. పెళ్ళయి విడిపోవటం, మోసపోయి ఒక బిడ్డకు జన్మఇచ్చి తల్లికావటం... మనసుకు నచ్చిన అమ్మాయి విషయంలో ఇలాంటి అభ్యంతరాలుండకూడదనేది నా సిద్ధాంతమే. అయితే అలాగని పనిగట్టుకుని అభ్యుదయం కోసమో, లేక మేలు చేయాలనో పెళ్ళికి అంగీకరించటం మాత్రం సరికాదు. కేవలం మనసుకు నచ్చితేనే జీవితంలోకి ఆహ్వానించాలి లేకపోతే ఇంకో విధమైన సహాయంతో సరిపుచ్చుకోవాలి! ఇది నా ఉద్దేశ్యం మాత్రమే అనుకోండి.

మా ఇద్దరి మనసుల్లోనూ వేరే వేరే వ్యక్తులున్నారనే విషయం తెలియక, నాగసుందరిని కోడలుగా స్వీకరించే విషయం అమ్మ మీతో సంప్రదించింది. అంతే! ఆ తర్వాతనే మేమిద్దరం మా నిర్ణయాలను అమ్మకు తెలియజేశాం. ఇదండీ సంగతి!

ఇంకో విషయం కూడా చెప్పాలి.

ఆరోజు... మీరు చెప్పిన పెళ్ళి విషయం విని షాక్‌కి గురయ్యానని మీరు అనుకుని ఉంటారు! ఆ విషయం నాకు ముందే తెలిసినా, అలాటి దిగ్భ్రాంతి ఎందుకు కలిగిందో అదీ చెప్పాలిగా!

నాకెందుకోగానీ, మనసులో ఓ మూల సందేహం ఉంది... నా పట్ల మీకు సుముఖత లేదేమోనని! కానీ మీరు... అయిష్టత వ్యక్తపరచకుండా, మీకు పెళ్ళయిందనే వార్తే ఆటంకమన్నట్లుగా ఆ మాట చెప్పేసరికి... నాకు కలిగిన ఆనందాశ్చర్యమది! ఈ మాట నేనే చెబుతున్నాను గనుక నమ్మాలి... మరి!

ఏ విషయమైనా ముఖాముఖీ మాట్లాడుకుంటేనే ఒకరి అభిప్రాయం మరొకరికి స్పష్టంగా తెలుస్తుంది! మరొకరి ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేయకపోవటమే మంచిది! ఇది ఎందుకు చెబుతున్నానంటే... మీ నాన్నమ్మ గారి ద్వారా మీకూ ఇష్టమేననీ, పెద్దల అనుమతీ ఉంటుందని తెలిసింది. అది మీ ద్వారా కూడా వినాలని అంతే!

నేను మిమ్మల్ని ఇష్టపడుతున్నానే విషయం నా స్నేహితులు ఇద్దరు ముగ్గరు పసికట్టి, నాకు చెప్పకుండానే మీ వివరాల సేకరణ ప్రారంభించారు. మీ ఊరిపేరు కనుక్కోగలిగాక, కొన్ని వివరాలూ తెలుసుకుని నా చెవిని వేశారు!

అయితేనేం... మీ పట్ల నాకున్న ప్రేమ మరింత పెరిగిందే తప్ప వెనక్కి తగ్గలేదు! మీరు మీ వివరాలన్నీ చెప్పినపుడు... నాకు ముందే తెలుసునని అనటం కంటే... మీ ద్వారానే మీరు చెప్పదలచుకున్న వివరాలన్నీ విందామనే ఆలోచనతో మాత్రమే మిన్నకుండిపోయాను!

మనసులోని ప్రేమను వ్యక్తీకరించగల నేర్పు అందరికీ ఉండదు! అందుకే ఏం రాయాలో తోచక తికమకపడుతున్నా సుమండీ...!

మీ కథలు చదవటం వలనే ఎంతో కొంత భావవ్యక్తీకరణ అలవడిరదని ఇన్నాళ్ళూ అనుకుంటూ వచ్చాను గానీ... ఇపుడీ ఉత్తరం రాస్తుంటే మాత్రం అది నిజం కాదని తెలుస్తోంది!

మీ కథల ప్రస్తావన రావటంతో, హఠాత్తుగా... నేను చదివిన మీ కథలోని ఒక సంఘటన గుర్తుకు వచ్చింది. అదేమిటో చెప్పమంటారా...?

ఒక అమ్మాయి, అబ్బాయి (కథలో ప్రధాన పాత్రధారులో, సూత్రధారులో అయి ఉంటారు గానీ అదంత అవసరమైన విషయం కాదనుకోండి) నగరంలోని ఒక వీధిలో వెళ్తూ... ఒక పార్కు ముందు కాసేపు ఆగి నిలబడతారు.

ఎదురుగా కనిపిస్తున్న అందమైన, ఆధునికంగా ఉన్న భవంతులను చూస్తూ, ఆ అబ్బాయి 'ఈ భవంతుల్లో... ఇలాంటి ఇల్లు ఉంటే ఎంత బావుంటుందో అనిపించేంతగా ఏది నచ్చిందీ..?' అనడుగుతాడు. 'ఎందుకూ' అని ఆ అమ్మాయి ఎదురు ప్రశ్న వేసినపుడు 'నాకు నచ్చినదే నువ్వు చెబితే, మనిద్దరి అభిరుచులూ ఒకటేనని అర్ధమౌతుందిగా' అని అంటాడు ఆ అబ్బాయి.

దానికి ఆ అమ్మాయి చిరునవ్వుతో చెప్పినది ఏమిటంటే... 'ఈ భవనాలే కాదు, ప్రపంచంలోని ఇంకెంత అద్భుతమైన కట్టడం చూసినా నాకు కావాలనిపించదు! ఎందుకంటే మా ఇల్లే నాకు గొప్ప అందంగా కనిపిస్తుంది కాబట్టి...! మన ఆత్మీయులతో ఏ ఇంటిలో ఉంటే... అదే నందనవనాన్ని మించిన అందమైన ఆవాసం! ఇదే నా అభిరుచి, అభిప్రాయం!' అని!

రాసింది మీరే కాబట్టి మీ అభిరుచి అదే అయివుంటుందని అనుకుంటున్నాను. ఒకసారి మీరే అన్నారుగా, రచయిత ఏదో ఒక పాత్ర ద్వారా తన అభిప్రాయాలనూ వెల్లడిరచటం జరుగుతూంటుందని!

ఇపుడు... అందుకే, నూటికి నూరుపాళ్ళు నా అభిరుచికి సరిజోడీ అయిన అమ్మాయే నా జీవితంలోకి రాబోతోందనే ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నా!

నచ్చిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవటాన్ని మించిన అదృష్టం, ఆనందం వేరే ఏమీ ఉండదని నా

ఉద్దేశ్యం! అవునండీ నిజం! ఇష్టసఖి అడుగుపెడితే ఎడారి లాంటి జీవితం అయినా సరే, వెన్నెల మడుగులా మారి మురిపించదూ...?

నా మనసులో ఓ సందేహం ఇంకా అలాగే ఉంది. సందేహమెందుకూ నివృత్తి చేసుకుంటే సరిపోదా అనే ఆలోచన వచ్చిందిపుడే.

అందుకే ఒక అభ్యర్ధన!

మీ ఇష్టాన్నీ తెలియజేస్తూ రెండే రెండు వాక్యాలతో అయినా ఒక చిన్న ఉత్తరం... ధ్రువ పత్రంలా నాకు కావాలి! అమ్మా వాళ్ళు పెళ్ళి మాటలకు మీ ఇంటికి రావటానికి మంచిరోజు వెతికే పనిలో

ఉన్నారు. ఈ ప్రయాణ సన్నాహాలకి మీ అనుమతి పత్రం... అదేనండి... మీ ఇష్టాన్ని తెలియజేసే

ఉత్తరం... కావాలిగా... ఆలశ్యం చేయకుండా వెంటనే పంపించండి!

ఎదురు చూస్తూంటాను మరి!

బామ్మా... ఇక ముగించనా.

అదిగో.. మీరు మళ్ళీ ఉలిక్కిపడ్డారా... మీ నాన్నమ్మగారిని నేను బామ్మా అంటానుగా, అందుకే ఏమరు పాటున అలా పిలిచాననుకున్నారా... కానే కాదు!

మీ హైస్కూలు రోజుల్లో... మీ స్నేహితుల మధ్య మీకు 'బాపు బొమ్మ' అనే బిరుదు ఉందని నాకూ తెలుసునని చెప్పటానికే ఇలా...! మరి షార్ట్‌కట్‌లో ఆ బిరుదునే 'బామ్మ' అని అంటారని మీకూ తెలిసే

ఉంటుంది!

మీ కలం పేరుతో మొదలు పెట్టి, ముద్దు పేరుతో ఈ ఉత్తరాన్ని ముగిస్తున్నానే విషయాన్ని గమనించారుగా...!

` హేమంత్

ఉత్తరం చదవటం పూర్తి చేసిన మహాలక్ష్మి పెదవులపైకి చిరునవ్వు వచ్చింది. మనసులోకి వసంతమేదో ప్రవేశించినట్లుగా, అణువణువునా ఆనందం తొణికిసలాడిరది.

* * *

అంతా ఏం చేస్తున్నారోనని తలుపులు కొంచెంగా తీసి చూసింది మహాలక్ష్మి.

ముందుగదిలో ఆమె తల్లిదండ్రులతో పాటు నాన్నమ్మ, పక్కనే ఉండే పెద్దమ్మలూ అంతాకూర్చుని మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళ ముందుకు వెళ్ళడం అనవసరమనుకుంటూ చెవిబగ్గి మాటలు వింది.

''వాళ్ళని మనింటికి రమ్మని పిలిచే ముందు బుల్లెమ్మాయినీ తనకి ఈ సంబంధం ఇష్టమో, కాదో ఓ మాట అడిగితే బావుంటుందిగా...!'' తల్లి మాటలు అవి.

మీనాక్షమ్మ వెంటనే ఠకీమని సమాధానం చెప్పేసింది. ''తనకి ఇష్టమేనని నేను చెబుతూనే

ఉన్నాగా. పదే పదే ఆ విషయాన్ని అడగాలా... చెప్పటానికి తనకీ మొహమాటంగా ఉండదూ...! నిజంగా దానికి ఇష్టం లేకపోతే, మన ప్రయత్నాలకి చిరాకు పడదూ..! మౌనంగా ఉందంటే తనకీ ఇష్టమేనని అర్థమేగా...!''

ఇంకెవరో అన్నారు ''అది సరే... రేపో, మాపో వాళ్ళు వచ్చినపుడు ఏం చెప్పాలో అందరూ ముందే ఆలోచించుకునివుంటే మంచిది. లేకపోతే అందరిదీ తలో మాటా అవుతుంది...!''

''పెళ్ళి ఏర్పాట్లు గురించేగా....?''

''అంతే... ఇంకేం ఉంటాయి. అన్ని విషయాలూ అందరికీ నచ్చాక, ఇక పెళ్ళి ఎప్పుడు, ఎక్కడ, ఎలా అన్నదే కదా మిగిలిందీ...!''

''ఇంకెక్కడ... మన ఊళ్ళో... మనింటి ముందే...''

''అలా వద్దు... అక్కడ పట్నంలో ఏదైనా పెద్ద హాలుగానీ, సత్రంగానీ తీసుకుంటే బావుంటుంది. వాళ్ళకీ బావుంటుంది. వాళ్ళ బంధువులందరూ ఆ వూళ్ళో, దగ్గర చుట్టుపక్కల వూళ్ళల్లోనే ఉన్నారని అన్నారుగా! మనమూ కొద్దిమందిమి వెళ్తే సరిపోతుంది.''

మీనాక్షమ్మ మళ్ళీ చెప్పింది. ''అందరం కూర్చుని ఆ విషయాలన్నీ ఆలోచించి నిర్ణయించుకోవచ్చు. అందరికీ ఏ పద్ధతి వీలుగా ఉంటే అలాగే చేద్దాం. వాళ్ళతో మనకెటువంటి పేచీలు ఉండవని నాకు బాగా తెలుసు.''

''అవును... ఆ మాటా విన్నాం. వాళ్ళు మనల్ని ఇబ్బంది పెట్టకూడదని ఎలా పెళ్ళి చేసినా ఫర్వాలేదని అనొచ్చు. అయితే మనకి మాత్రం ఏం లోటు... ఘనంగానే ఏర్పాట్లు చేయగలంకదా...!''

అలా వాళ్ళందరి మాటల్ని విన్న మహాలక్ష్మి తలుపులు మళ్ళీ చేరవేసి లోపలకి వచ్చేసింది. ఆ వివరాలన్నీ తనకనవసరమేననుకుంటూ, ముందుగా తను చేయాల్సిన పని మాత్రం వేరే... అదే ఆలోచనతో టేబుల్ ముందు కూర్చుని తన లెటర్ పాడ్‌లోని కాగితం తీసుకుని హేమంత్‌కి ప్రత్యుత్తరం మొదలు పెట్టింది.

''మీ ఉత్తరం చదవటం ముగించిన వెంటనే ధ్రువ పత్రం రాయటం మొదలుపెట్టాను. ఆలశ్యం అయితే పాస్‌పోర్టులేక మీ ప్రయాణం గానీ ఆగిపోతుందేమోనని...! పాస్‌పోర్టు అంటే అదేనండీ, మీరు కోరిన అనుమతి పత్రం!

ముందుగా ఒక మాట. మనసులోని భావాలను వ్యక్తం చేయటం సరిగా రాదంటూనే తీపి, కారం సమతూకంలో కుదిరినట్లుగా మీ ఉత్తరాన్ని తీర్చి దిద్దారు!

ఇదేమిటని ఉలికిపడకండి. వంటల్లోని రుచులు మీకు మాటల్లో కూడా కావాలని నేనూ విన్నానులెండి! ఎక్కడైనా తీపి, కారం... వంటకాలు వేరు వేరుగా ఉంటాయి. కానీ మీకు మాత్రం.... రెండూ కలగలిపి కొత్తరకం సృష్టించగల నేర్పు ఉందని మీ ఉత్తరం నిరూపించింది! నిజం!

ఇక నా అనుమతి మీకు తెలియజేస్తూ.. మీకో రెండు మాటలు.

మీ అభిప్రాయమే నాది కూడా!

ప్రేమించిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవటాన్ని మించిన ఆనందం, అదృష్టం వేరే ఏముంటాయీ...?

నిరంతరం నా వెన్నంటే ఉండి మిన్నంటే ప్రేమను అందిస్తానంటే... కాదనగలనా...?

జీవితకాలం తోడుగా నిలబడి ఒక రస సామ్రాజ్యాన్ని రాసిస్తానంటే... వద్దంటానా...?

మీరు రెండు వాక్యాల చిన్న ఉత్తరమైనా సరిపోతుందని అంటే, నేను మరికొంచెం పెద్దదే రాసాను. వెంటనే పోస్టుచేయాలనే హడావుడిలో ముగించేస్తున్నా!

మిగతా కబుర్లన్నీ ఎపుడో, ఏమిటో... మీరే నిర్ణయించండి, సరేనా...!

` తుషార (మహాలక్ష్మి)

ఉత్తరాన్ని పోస్టుకు పంపించేసి స్థిమిత పడిరది మహాలక్ష్మి.

* * *

ఆ నవల చదవటం ముగించిన మానస పరుగున నాన్నమ్మ దగ్గరకు వచ్చి ''ఇదేమిటీ ఇలా ముగించేసావ్... పెళ్ళి ఏ పద్ధతిలో ఎక్కడ ఎలా జరిగిందో ఆ వివరాలన్నీ కూడా రాయాలిగా...?'' అనడిగింది.

మహాలక్ష్మి చిరునవ్వుతో చూసింది. ''అలాంటివన్నీ కూడా రాసుకుంటూ పోతే చిన్నది కాదు, ఓ పెద్ద నవలే అవుతుంది. నేనీ మధ్యకాలంలో రాయటం తగ్గించినా, నువ్వు అడిగావని... నా జీవితానుభవాలను నీకు పరిచయం చేయాలని మళ్ళీ చేసిన ప్రయత్నం ఇది!

టి.వి.లు వచ్చి రేడియోల ప్రాబల్యాన్ని తగ్గించేసాయి! ఇప్పుడు... సెల్‌ఫోన్ల ప్రభంజనం కొనసాగుతోంది! ఇలాంటి మార్పులు చాలానే వచ్చాయి. అయినా మనుష్యులూ, వాళ్ళ మనస్తత్వాలూ, సమస్యలూ యథాతదమే! కాలానుగుణంగా ఎదురయ్యే సమస్యలకు మనమూ ఎదురు నిలబడి పోరాటం చేయాలి.... మనకు నచ్చిన దారిలో నడవగలగాలి!

పెద్దవాళ్ళ అండదండలుంటే, ఎలాంటి ఒడిదుడుకులైనా ఎదుర్కొని ముందుకు సాగగలం! అందుకే... మన ఆలోచనలు, సమస్యలు అన్నింటిగురించీ తల్లిదండ్రులతో పంచుకునే అలవాటు పిల్లలకి

ఉండాలి! ఇంతకన్నా చెప్పేదేం లేదు!

నాన్నమ్మతో నాకెటువంటి అనుబంధం ఉండేదో అర్థమైందిగా! నాకెందుకో గానీ, నీతో మాట్లాడుతోంటే... నాన్నమ్మే మళ్ళీ నాకు మనవరాలిగా పుట్టిందా అనిపించి ఆనందంగా ఉంటుంది... తెలుసా...!''

''అవునే బుల్లెమ్మాయ్... ఆ భగవంతుడిని వరమడిగి నీకోసమే, ఇలా నీ మనవరాలిగా వచ్చాను! కాకపోతే, ఇపుడు మన స్థానాలు అటు ఇటుగా మారాయంతే...!'' తమాషాగా అంటూ నవ్వి మళ్ళీ అంది'' ఈ నవలకు ఏం పేరు అనుకుంటున్నావ్... నాకైతే 'హేమంత తుషారం' అనే పేరు బావుంటుందనిపిస్తోంది...!''

అంగీకార సూచకంగా తలవూపిన మహాలక్ష్మి ఆప్యాయంగా మానసను దగ్గరకు తీసుకుంది.

* * *